క్లుప్తంగా

కేసీఆర్ రోడ్‌షోకు తరలిరావాలి

● మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా మాజీ సీఎం కేసీఆర్ చేపడుతున్న రోడ్‌షో మంగళవారం మిర్యాలగూడలో ప్రారంభం కానుంది. కేసీఆర్ రోడ్‌షోకు అధిక సంఖ్యలో ప్రజలు తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఒక ప్రకటనలో కోరారు. బుధవారం సాయంత్రం 4గంటలకు పట్టణంలోని బస్టాండ్ వద్ద నుంచి రోడ్‌షో ప్రారంభమై రాజీవ్‌చౌక్ వద్ద నిర్వహించే సభలో కేసీఆర్ మాట్లాడుతారని తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్జి రవీందర్

దేవరకొండ: దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిఫ్ కోర్టు ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిఫ్ కోర్టు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పి.రవీందర్ అన్నారు. మంగళవారం కోర్టు ఆవరణలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కెవీఎస్.హరీష్‌బాబు, అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ఆంజనేయులు, న్యాయవాదులుతది తరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

డిండి: మండల కేంద్రానికి చెందిన పురం శివ అనారగ్యోంతో సోమవారం మృతిచెందాడు. మంగళవారం డిండి యువత చేయూత ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో మల్లేష్, వెంకటేష్, లింగమయ్య, దినేష్, గోవర్ధన్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

త్రిపురారం : దుగ్గెపల్లి 11 కేవీ విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల తొలగింపు కారణంగా బుధవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రవీందర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేత

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం చివరి పనిదినం కావడంతో విద్యార్థులకు ప్రగతి పత్రాలను హెచ్‌ఎం చేరుపల్లి శ్రీనివాసులు అందజేశారు. కార్యక్రమంలో సముద్రాల శ్రీనయ్య, కొర్ర లోక్యానాయక్, సూర్యనాయక్, నల్ల నరసింహ, జగదీష్, చంద్రయ్య, ఎబినైజర్, సంపత్‌కుమార్, సీతారాం, సద్రీమ్ పాల్గొన్నారు.

ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులను హెచ్‌ఎం ఎస్. విజయకుమారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రకళ, అస్మత్, తార సువర్ణ, విజయలక్ష్మి, గోపారపు రాజు ఉన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

వేములపల్లి : పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పెదమాం భరత్ కోరారు. మంగళవారం వేములపల్లి మండలంలోని శెట్టిపాలెంలో ఇంటింటి తిరిగి ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు పెదమాం వెంకన్న, మహేష్, ఈట మహేష్, బాబు, గౌతమ్, రమేష్ పాల్గొన్నారు.

వేసవి సెలవులను వినియోగించుకోవాలి

హాలియా : విద్యార్థులు వేసవి సెలవులను వినియోగించుకోవాలని సెక్టోరియల్ అధికారి వీరయ్య సూచించారు. మంగళవారం అనుముల ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఇంటి వద్ద ఉండి విద్యాబుద్దులు నేర్చుకునేలా చూసే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చంద్రుడు నాయక్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు లోక్యానాథ్, వెంకటేశ్వర్లు, మధుసూధన్, నిర్మల, రజిత, సౌజన్య ఉన్నారు.

మద్యం పట్టివేత

మిర్యాలగూడ అర్బన్: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని మిర్యాలగూడ రైల్వే పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. ఎన్నికల నిబంధనలో భాగంగా రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా ఉన్న పెట్టెలను పరిశీలించారు. అందులో ఓ కంపెనీకి చెందిన 96ఫుల్ బాటిళ్లలో మద్యం ఉన్నట్లు గుర్తించారు. ఆ మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

‘ఎర్లీ బర్డ్’కు ఆరు రోజులే గడువు

● ముందస్తు ఆస్తి పన్ను చెల్లించిన వారికి ఐదుశాతం రాయితీ
● ఏప్రిల్ 30 వరకు చెల్లించిన వారికే చాన్స్
● హాలియా మున్సిపాలిటీలో పన్నుల లక్ష్యం రూ. 1.98కోట్లు
● వసూలైంది రూ.30లక్షలు మాత్రమే..

హాలియా : ముందస్తు పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోంది. ఆస్తిపన్ను రాబట్టుకునేందుకు మున్సిపాలిటీ ఆదాయాన్ని సమకూర్చేందుకు మున్సిపల్ శాఖ ఎర్లీబర్డ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. హాలియా మున్సిపాలిటీలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎర్లీబర్డ్ పథకంలో భాగంగా ముందస్తు పన్ను చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ కల్పించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన గడువు ఇక ఏడు రోజులు మాత్రమే మిగిలి ఉంది. రికార్డుల ప్రకారం హాలియా మున్సిపాలిటీల్లో ఈ ఏడాది రూ. 1.98కోట్లు ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం ఉండగా మొత్తం 5,436 అసెస్మెంట్స్ ఉన్నాయి. సర్కార్ ఆదేశాల మేరకు దృష్టి సారించిన అధికార యంత్రాంగం ఈనెల 23వ తేదీ వరకు మున్సిపాలిటీలో ఆస్తి పన్ను చెల్లింపులో 1,036 మంది నుంచి రూ.30లక్షలపైగా పన్ను వసూలు చేసినట్లు తెలిపారు.



ఆదాయ వనరులు కీలకం

మున్సిపాలిటీ నిర్వహణ, పౌరులకు అందించే సేవలు సక్రమంగా కొనసాగాలంటే సొంత ఆదాయ వనరులు కీలకం. ఈ మేరకు పన్నులు, ఇతర ఖాతాల ద్వారా సాధారణ నిధి నిధులు జమ కావాల్సి ఉంటుంది. ఇందులో జమయ్యే నిధుల్లో ప్రధాన వాటా ఆస్తి పన్నులదే, ఏటా ఏప్రిల్ నుంచి మార్చి వరకు ఏడాది కాలవ్యవధిలో ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

మున్సిపాలిటీలో విస్తృతంగా ప్రచారం

ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపుదారుల కోసం పురపాలకశాఖ ఎర్లీబర్డ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమైంది. ఏప్రిల్ నుంచి మార్చి వరకు ఆర్థిక సంవత్సరానిగాను ముందస్తు పన్ను చెల్లించే వారికి ఆస్తిపన్నులో ఐదు శాతం రాయితీ ఇస్తుంది. ఈ నెల 30లోపు చెల్లించే వారికి మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుంది.

గడువు దాటితే అసలుపై 2శాతం..

సకాలంలో ఆస్తి పన్ను చెల్లించక పోతే పన్నుపై 2శాతం అపరాధ రుసుం పడుతుంది. మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం మొదటి అర్ధ సంవత్సరానికి సంబంధించి సెప్టెంబర్ నెలాఖరులోగా, రెండో అర్ధ సంవత్సరానికి మార్చి31లోగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రకారం ఆస్తి పన్ను చెల్లించక పోతే పన్నుపై 2శాతం అపరాధ రుసుం పడుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి



2024–25 ఆర్థిక సంవత్సరానికి మున్సిపాలిటీల్లో పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం ఎర్లీ బర్డ్ పథకం ప్రవేశ పెట్టింది. ఈ సంవత్సరం ఆస్తి పన్ను ఏప్రిల్ 30వ తేదీలోగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఇవ్వనుంది. ఈ పథకంపై ఇళ్ల యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– మున్వర్ అలీ, మున్సిపల్ కమిషనర్, హాలియా

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించాలి

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వీరారెడ్డి

దేవరకొండ: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం దేవరకొండలో ఏర్పాటు చేసిన సీఐటీయూ అనుబంధ కార్మిక యూనియన్ల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నరేంద్రమోదీ పదేళ్ల ప్రధానమంత్రిగా ఉండి రాజ్యాంగానికి మూల స్తంభాలైన లౌకిక, ప్రజాస్వామ్య, ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్ముతూ సామాజిక న్యాయాన్ని కూల్చుతుందని ఆయన ఆరోపించారు. మోదీ కంటున్న కలలను ఓడించి వామపక్ష,లౌకిక శక్తులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్మికవర్గంపై బీజేపీ పదేళ్లగా యుద్ధం చేస్తూ కార్మిక, ఉద్యోగుల ప్రయోజనాలను దెబ్బతీస్తుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు నల్ల వెంకటయ్య, నాగరాజు, బషీర్, బిజిలి లింగయ్య, జవహర్‌లాల్, తదితరులున్నారు.

రఘువీర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలి

● నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి


కాంగ్రెస్‌లో చేరిన వారిని ఆహ్వానిస్తున్న నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన సోదరుడు కుందూరు రఘువీర్ రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి కోరారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి, పదవులకు రాజీనామా చేసిన త్రిపురారం మండల తాజామాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీసెల్, నాయకులు, ఆయా పార్టీల నాయకులు మంగళవారం కుందూరు జానారెడ్డి నివాసంలో 400మందికి పైచిలుకు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీకి చెందిన జెడ్పీటీసీ భారతిభాస్కర్‌నాయక్, ఎంపీపీ గౌరవ సలహదారు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, బిట్టు, రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు మూడిముక్ల బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటా.. ఆశీర్వదించండి

● నల్లగొండ లోక్‌సభ స్వతంత్ర అభ్యర్థి చొల్లేటి ప్రభాకర్


దేవరకొండలో కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్న చొల్లేటి ప్రభాకర్ తదితరులు

దేవరకొండ: త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీలో నిలవనున్న తనను ఆశీర్వదించి గెలిపిస్తే అండగా ఉంటానని స్వతంత్ర నల్లగొండ ఎంపీ అభ్యర్థి, రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నల్లగొండ లోక్‌సభ పరిధిలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రజా గొంతుకనై ఉద్యమిస్తానని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పట్టణంలో ఆయన కరపత్రాల ద్వారా ప్రజలను తనకు ఓటు వేసి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాజేశ్వరి, కిషన్ కుమార్, చందర్, రామ్మోహన్, శ్రావణ్‌కుమార్, తదితరులున్నారు.

ఘనంగా ప్రపంచ పుస్తక దినోత్సవం


విద్యార్థులకు బాల సాహిత్య పుస్తకాలను అందజేస్తున్న హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి

మిర్యాలగూడ : ప్రపంచ పుస్తక దినోత్సవం, ఆంగ్ల భాషా దినోత్సవాన్ని మంగళవారం పట్టణంలోని బకల్‌వాడీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని బాల సాహిత్య పుస్తకాలను ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి బహూకరించారు. కార్యక్రమంలో అనిల్ కుమార్, ఉమాశంకర్, జియావుద్దీన్, సైదమ్మ, అనిత, సైదులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

మనిషి మేధస్సును పెంచేవి పుస్తకాలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మనిషి మేధస్సును, విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయని అల్వాల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాపోలు పరమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని అల్వాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తుమ్మురుగోటి జ్యోతి, పావని, బాలకృష్ణ, విజయలక్ష్మి, లింగమ్మ, వీరయ్య, గౌస్‌బాబా పాల్గొన్నారు.

చెరువు మట్టిని పొలాలకు కేటాయించాలి

● నీటిపారుదలశాఖ డీఈ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా


నీటిపారుదలశాఖ డీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

మిర్యాలగూడ : దామరచర్ల మండలం దిలావర్‌పూర్ గ్రామంలో గల చెరువు మట్టిని పంట పొలాలకు కేటాయించాలని మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని నీటిపారుదలశాఖ డీఈ కార్యాలయం ఎదుట అధికారుల కారును అడ్డగించి రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ నిబంధనల మేరకు చెరువు మట్టిని రైతుల పంటల పొలాలకు కేటాయించకుండా అక్రమంగా దళారులకు అనుమతి ఇస్తున్నారని ఆరోపించారు. మూడు నెలలుగా పట్టాదారు పాస్ పుస్తకాలతో చెరువు మట్టి కోసం దరఖాస్తులు చేసుకున్న రైతులకు ఇవ్వకుండా దళారులకు ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కై చెరువు మట్టి దందాకు పాల్పడుతున్నారని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు తగిన విచారణ చేపట్టి చెరువు మట్టిని రైతుల పంటపొలాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దిలావర్‌పూర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

● దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్


దేవరకొండ : కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చందంపేట మండలం గన్నేర్లపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. పార్లమెంట్ అభ్యర్థి గెలుపునకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జాల నర్సింహారెడ్డి, సిరాజ్‌ఖాన్, శ్రీశైలం యాదవ్, జెడ్పీటీసీలు బుజ్జి, బాలునాయక్, నాయకులు ముక్కమళ్ల వెంకటయ్య, బిక్కునాయక్, రామకృష్ణారెడ్డి, ముత్యాల సర్వయ్య, కిన్నెర హరికృష్ణ తదితరులున్నారు.

ఇష్టానుసారంగా ధాన్యం కాంటాలు

● పాములపాడు ఐకేపీ కేంద్రంలో నిబంధనలకు పాతర
● నిర్వాహకుల తీరుపై రైతుల ఆగ్రహం
● అధికారుల పర్యవేక్షణ కొరవడిందని ఆరోపణ


పాములపాడులో రోడ్డు వెంట ధాన్యం రాశులు

మాడుగులపల్లి : మండలంలోని పాములపాడు ఐకేపీ కేంద్రంలో ధాన్యం కాంటాలు ఇష్టానుసారంగా జరుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వాహకులు తమకు నచ్చిన వారివి కాంటా వేస్తున్నారని వాపోతున్నారు. కొనుగోలు కేంద్రంలో కొందరు ధాన్యం పోసి 20రోజులు గడుస్తున్నా కాంటాలు కావడం లేదని, కొందరివి మాత్రం వెనువెంటనే వేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ధాన్యం నిబంధనల మేరకు ఉన్నా నిర్వాహకులు కాంటా వేయకుండా సాకులు చెబుతున్నారని, కొనుగోళ్ల తీరును నిత్యం పర్యవేక్షించాల్సిన ఏపీఎం అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో పరిస్థితి గందరగోళంగా మారిందని పెదవి విరుస్తున్నారు. మండలంలోని చిరుమర్తి, ఆగామోత్కూర్, గార్లకుంటపాలెం, పాములపాడు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో గత నెల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. వీటిలో పాములపాడు మినహా మిగిలిన కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. విషయంపై ఏపీఎం అనూక్‌ను వివరణ కోరగా సోమవారం పాములపాడు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలిచ్చామని, ఓ రైతు కుటుంబంలో వ్యక్తి చనిపోవడంతో అతడి ధాన్యం వెంటనే కాంటా వేసినట్లు తెలిపారు.

ఇటుక బట్టీలను తొలగించాలని వినతి


మిర్యాలగూడ తహసీల్దారు హరిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం తుంగపాడు, శ్రీనివాసనగర్ గ్రామాల మధ్య గల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమీపంలో నిర్వహిస్తున్న ఇటుక బట్టీలను తొలగించాలని కోరుతూ మంగళవారం మండల తహసీల్దారు హరిబాబుకు ఆ ప్రాంత వాసులు వినతిపత్రాన్ని అందజేశారు. అదే విధంగా ఆర్డీఓ, మైనింగ్ కార్యాలయంలో కూడా వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమీపంలో సుమారు 300కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్నారని తెలిపారు. నిత్యం లారీలు వచ్చి వెళ్తుండడంతో దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అనారోగ్యాల బారిన పడుతున్నామని తమకు రక్షణ కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో భార్గవరెడ్డి, రామకృష్ణ, వేణు, యశ్వంత్, ఇమ్రాన్, శృతి, గీత, సోములు, హరిక, శ్రీనివాస్, సంధ్య, లక్ష్మి, శ్రీను, అర్జున్, హబీబ్, విష్ణు, కిశోర్, చంద్రశేఖర్‌రెడ్డి, నాగమణి, మాధవి, శ్రీధర్, అన్నపూర్ణ, అపర్ణ తదితరులున్నారు.

ప్లాస్టిక్‌ను వాడితే చర్యలు

మిర్యాలగూడ టౌన్ : దుకాణదారులు నిషేధిత ప్లాస్టిక్‌ను వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎండి యూసుఫ్ హెచ్చరించారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని ఇస్లాంపురలో గల పలు షాపులను ఆయన తనిఖీ చేశారు. 30 కిలోల ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకున్నారు. రెండవ సారి జరిగే తనిఖీలో కూడా ఇదే బ్యాగులు దొరికితే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు భారీగా జరిమానా విధిస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. తనిఖీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ అజ్మీర కిరణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రామభక్తుడిని పూజిస్తే కష్టాలన్నీ తొలగుతాయి

● సిద్దిపేట జిల్లా పీఠాధిపతి శ్రీ వీరధర్మరాజ


మిర్యాలగూడలో జరిగిన హనుమాన్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న వీరధర్మరాజ

మిర్యాలగూడ టౌన్ : రామ భక్తుడు హనుమంతుడిని పూజిస్తే కష్టాలన్నీ తొలగిపోతాయని సిద్దిపేట జిల్లా పీఠాధిపతి శ్రీ వీరధర్మరాజ అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపులో గల శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయం వద్ద జరిగిన హనుమన్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హనుమాన్ జయంతిని హిందూ మత విశ్వాసాల ప్రకారం సంవత్సరానికి రెండు సార్లు జరుపుకుంటామని, దీని వెనుక రెండు భిన్నమైన నమ్మకాలున్నాయని పేర్కొన్నారు. హనుమాన్ జయంతిని సోదరభావం, ఐక్యతకు చిహ్నంగా పరిగణించబడుతుందన్నారు.

వీర హనుమాన్ విజయ్ యాత్ర

హనుమాన్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే వీర హనుమాన్ విజయ యాత్ర విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఎన్ఎస్పీ క్యాంపులో గల శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయం నుంచి రాజీవ్ చౌక్ నుంచి దేవాలయం వరకు సాగింది. జై హనుమాన్.. జై శ్రీరాం నినాదాలతో భక్తులతో మార్మోగింది. అదే విధంగా శోభయాత్రలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, విశ్వహిందూ పరిషత్‌నాయకులు గంజి సుధాకర్, గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, తల్లం వెంకన్న, నాంపల్లి రాంకుమార్, రాపర్తి శ్రీనివాస్, గౌరు ప్రవీణ్, కిరణ్‌రాజు, అవుల నరేష్, చిత్తలూరి శ్రీనివాస్, సత్యనారాయణ, రాంప్రసాద్, గోళ్ల ప్రసాద్, జనార్దన్, మండడి లక్ష్మమ్మ, రవి తదితరులున్నారు.

13 మంది బాల కార్మికులకు విముక్తి

మిర్యాలగూడ టౌన్ : ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న 13మంది బాల కార్మికులకు అధికారులు విముక్తి కల్పించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణానికి చెందిన ముత్తినేని కిరణ్, కుర్ర అశోక్ మండలంలోని గూడూరు గ్రామ సమీపంలో రెండు ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారు. అందులో బిహార్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన చిన్నారులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం రాత్రి మిర్యాలగూడ ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ హరిబాబు, రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ నరేశ్ ఆధ్వర్యంలో ఇతర శాఖల అధికారులు ఇటుకబట్టీలపై దాడులు నిర్వహించారు. అక్కడ పనిచేస్తున్న 13మంది చిన్నారులను గుర్తించారు. వెంటనే వారిని మిర్యాలగూడ బాలల సంరక్షణ సమితికి తరలించారు. బాలకార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తున్న కిరణ్, అశోక్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు.

ఘనంగా వీర హనుమాన్ విజయ యాత్ర


దేవరకొండలో నిర్వహిస్తున్న వీరహనుమాన్ విజయ యాత్ర


పెద్దవూరలో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు


మాడ్గులపల్లి: ర్యాలీలో పాల్గొన్న యువత

దేవరకొండ: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం దేవరకొండ పట్టణంలో శ్రీ వీరహనుమాన్ విజయయాత్రను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తుల్చమ్మ కుంట ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి డిండి చౌరస్తా మీదుగా పట్టణంలోని ప్రధాన రహదారి గుండా విజయయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో వీరహనుమాన్ విజయయాత్ర కనుల పండువగా సాగింది. కార్యక్రమానికి శ్రీ శ్రీనివాసానంద స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గుంటోజు రామకృష్ణ, బాల లింగయ్య, బూషరాజు గిరి, బండారు కొండయ్య, రాజు, ఐతరాజు శ్యాం, గణేష్, తాడిశెట్టి సుదర్శన్, సంతోష్‌రెడ్డి, ఉప్పల శ్రీనివాస్, కర్నాటి సురేష్, గుండాల అంజయ్య, నక్క వెంకటేష్, చండీశ్వర్, సాగర్, జల్దా భాస్కర్, రమేష్ ఉన్నారు.

పెద్దవూర: మండల కేంద్రంలో మంగళవారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై హనుమ నామ కీర్తనలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మిట్టపల్లి శ్రీనివాస్, జోగు రమేష్, నర్సింహ, జనార్దన్‌రెడ్డి, శ్రీకాంత్‌చారి, ప్రవీణ్, రంగా, శివ, రాము, కోటేష్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని శ్రీ దుర్గా మాత ఆంజనేయస్వామి దేవాలయం నుంచి మొదలైన హనుమాన్ విజయ యాత్ర పట్టణ చౌరస్తా మీదుగా జై శ్రీరామ్..జై హనుమాన్ నినాదాలతో భక్తిభావంతో సాగింది.

చింతపల్లి : చింతపల్లి మండల కేంద్రంతో పాటు వెంకటంపేట, మాల్ వెంకటేశ్వరనగర్, కుర్మేడు గ్రామాల్లో మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పుర వీధులలో హనుమాన్ చాలీసా పారాయణం చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డిండిలో కనుల పండువగా..

డిండి: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో మంగళవారం హనుమాన్ విజయ్ యాత్రను భక్తులు కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చెన్నకేశవ ఆలయం నుంచి మేళ తాళాల నడుమ స్వామి వారిని గ్రామ పరువీధుల గుండా ఊరేగించారు. కోలాట బృందం, భజన కారులు ఆడి పాడిన భక్తి పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ.సురేష్, ఎస్ఐ.రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసారు. భక్తులకు అన్నదానం చేసారు. కార్యక్రమంలో ఏటి.కృష్ణ, దినేష్, రాఘవేంద్ర, శ్రీను, సతీష్, సందీప్, అంజి, రమేష్ పాల్గొన్నారు.

మాడ్గులపల్లిలో..

మాడుగులపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిరుమర్తి, మత్రిగూడెం, దాచారంలోని ఆంజనేయస్వామి ఆలయాలు తెల్లవారుజాము నుంచే భక్తులతో సందడిగా మారాయి. ఆలయాల్లో స్వామివారికి అర్చకులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. చిరుమర్తి గ్రామంలో యువత ర్యాలీ నిర్వహించి జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు.


మిర్యాలగూడ పట్టణంలో జరిగిన హనుమాన్ విజయ యాత్రలో పాల్గొన్న భక్తులు


కొండమల్లేపల్లిలో : హనుమాన్ విజయ యాత్రలో పాల్గొన్న మహిళలు


డిండి : కోలాటం ఆడుతున్న మహిళలు